# వలస రాజ్యంలో విప్లవ జ్వాలలు!

**ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన రెవెన్యూ విధానాలు, సాంఘిక సంస్కరణలు సమాజంలోని వివిధ వర్గాలను అసంతృప్తికి గురిచేశాయి. దాని ఫలితంగా గిరిజన, రైతుల, సిపాయిల విప్లవాలు జరిగాయి. భారతదేశ చరిత్ర గతిని మార్చేసిన ఈ తిరుగుబాట్లకు కారణాలు, వాటి ఫలితాలను పోటీ పరీక్షల అభ్యర్థులు అధ్యయనం చేయాలి.**



1857 తిరుగుబాటులో సిపాయిలను అణచివేస్తున్న బ్రిటిష్ సైనికులు

## ఆంగ్ల వ్యతిరేక తిరుగుబాట్లు

వ్యాపారం నిమిత్తం వచ్చిన ఆంగ్లేయులు క్రమంగా భారత దేశ రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని దేశాన్ని ఆక్రమించారు. మన దేశాన్ని వలస రాజ్యంగా మార్చి ఆర్థిక దోపిడీ చేశారు. కుటిల రాజకీయ సిద్ధాంతాలు, పద్ధతులను అవలంభించారు. ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన రెవెన్యూ విధానాలు, సాంఘిక సంస్కరణలు భారత సమాజాన్ని, వివిధ వర్గాలను అసంతృప్తికి గురి చేశాయి. ఫలితంగా అధికారాన్ని కోల్పోయిన రాజులు, సామంతులు, దోపిడీకి గురైన భూస్వాములు, జమీందార్లు ప్రాధాన్యం కోల్పోయిన కులీన వర్గాలు, అధిక శిస్తు భారంతో కుంగిపోయిన రైతులు, గిరిజనులు, అసమానత, జాతి వివక్ష, తక్కువ జీతాలు లాంటి అసౌకర్యాలు పొందుతున్న సిపాయిలు మొదలైనవారు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా అనేక తిరుగుబాట్లు చేశారు.



రచయిత
బొత్స నాగరాజు
అసిస్టెంట్ ప్రొఫెసర్

★ 1763-1800 మధ్య ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సన్యాసి ముఠాల తిరుగుబాట్లు జరిగాయి.
★ 1783లో బిష్ణుపూర్, ఒడిశా పాలకులు తిరుగుబాట్లు చేశారు.
★ 1799 దళ్ భమ్ తిరుగుబాటు, 1800-1805 మధ్య కేరళ వర్మ తిరుగుబాట్లు జరిగాయి.
★ 1798-1802 కట్టబొమ్మన్ తిరుగుబాటు జరిగింది.
★ 1824లో కిట్టూరు తిరుగుబాటు, 1844లో గడ్కారీ తిరుగుబాట్లు చోటు చేసుకున్నాయి.
★ బెంగాల్‌లోని ముస్లింలు షరియతుల్లా నాయకత్వంలో ఫెరైజీ ఉద్యమం నడిపారు.
★ 1830-1857 మధ్య బిహార్, బెంగాల్‌లోని ముస్లింలు వహాబీ ఉద్యమం చేశారు.

## పంచాయతీ సెక్రటరీలు, గ్రూప్-4, వీఆర్‌వో ప్రత్యేకం

## భారతదేశ చరిత్ర

### గిరిజన, రైతుల తిరుగుబాట్లు

★ ఆంగ్లేయులు అటవీ భూములను ఆక్రమించుకుని ఆదివాసీలు, గిరిజనులపై అనేక నిర్బంధాలను, అధిక పన్నులను విధించడం ప్రారంభించారు.
★ 1864లో అటవీ శాఖను ఏర్పాటు చేశారు.
★ అటవీ ఉత్పత్తులను వాడుకోవడానికి గిరిజనుల నుంచి 'పుల్లరి' అనే పన్నును విధించేవారు.
★ ఫలితంగా ఆదివాసీలు, గిరిజనులు తమ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవడానికి దేశవ్యాప్తంగా అనేక తిరుగుబాట్లు చేశారు.
★ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతంలోని భిల్లులు, బిహార్, బెంగాల్‌లోని సంతాలులు, బిహార్, బెంగాల్, ఒడిశాల్లోని కోలులు, రాజస్థాన్‌లోని మేర్‌లు అనేక తిరుగుబాట్లు చేశారు.
★ 1817-31 మధ్య భిల్లులు సేవారాం నాయకత్వంలో పెద్ద ఎత్తున తిరుబాట్లు చేశారు.
★ 1831-32 మధ్య కోవ్‌లు చిరో తెగకు చెందిన పితాంబర్ నాయకత్వంలో తిరుగుబాటు చేశారు.
★ 1846-48 మధ్య గోండ్‌లు సామ్ బిసాయ్ నాయకత్వంలో, 1855-56 మధ్య సంతాలులు సిధు, కన్హూల నాయకత్వంలో, 1822లో రమోసే తెగవారు చిత్తూర్ సింగ్ నాయకత్వంలో తిరుగుబాట్లు చేశారు.
★ ఈశాన్య భారతదేశంలోని గిరిజన తిరుగుబాట్లకు నాయకత్వం వహించిన ఊట్‌రోట్ సింగ్‌ను ఆంగ్లేయులు ఉరితీశారు.
★ పశ్చిమ కనుమల్లోని రమోసే తెగవారు చిత్తూరు సింగ్ నాయకత్వంలో 1822లో సతారా పరిసర ప్రాంతాల్లో తిరుగుబాటు చేశారు.
★ గోండ్‌లు మొదటి హార్డింజ్ కాలంలో, సంతాలులు లార్డ్ డల్హౌసీ కాలంలో తిరుగుబాట్లు చేశారు.
★ ఆంగ్లేయుల విధానాలను వ్యతిరేకిస్తూ జమీందారులు కూడా తిరుగుబాటు చేశారు.
★ ఆంధ్ర ప్రాంతంలో (ఉత్తర సర్కారుల్లో) తలెత్తిన గంజాం, పర్లాకిమిడి తిరుగుబాట్లను అణచడానికి ఆంగ్ల ప్రభుత్వం రస్సెల్ దళాన్ని ఏర్పాటు చేసింది.
★ 1879లో గోదావరి జిల్లాల్లో రంప విప్లవం జరిగింది. పులికంటి సాంబయ్య, చంద్రయ్య, తమ్మన్న దొర, అంబుల్‌రెడ్డి లాంటివారు ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించారు.
★ 1922-24 మధ్య అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో రంప పితూరీ జరిగింది.
★ 1879 నాటి రంప విప్లవాన్ని అణచడానికి ఆంగ్ల ప్రభుత్వం సల్లీవన్ నాయకత్వంలో సైన్యాన్ని పంపింది.

### సిపాయిల తిరుగుబాట్లు

★ ఆంగ్ల సైన్యంలో పనిచేసే భారతీయులను సిపాయిలుగా పిలిచేవారు.




**తిరుగుబాటు ప్రాంతం - నాయకత్వం వహించినవారు**

| | | |
|---|---|---|
| బీహార్ | - | కున్వర్‌సింగ్ |
| లక్నో | - | మౌల్వీ అహ్మదుల్లా |
| బరేలీ | - | ఖాన్ బహదూర్ ఖాన్ |
| కాన్పూర్ | - | నానాసాహెబ్, తాంతియాతోపే |
| అయోధ్య | - | బేగం హజరత్ మహల్ |
| ఝాన్సీ, గ్వాలియర్ | - | ఝాన్సీ లక్ష్మీబాయ్ |
| హైదరాబాద్ | - | తుర్రేబాజ్ ఖాన్ |

★ ఆంగ్ల సైనికులతో సమానంగా పనిచేసినప్పటికీ సిపాయిలకు వారితో సమాన వేతనం ఇచ్చేవారు కాదు. పదోన్నతి కూడా లభించేది కాదు.
★ వివక్ష విధానం, పదోన్నతులు లేకపోవడం, తక్కువ జీతాలు ఇవ్వడం లాంటి వివక్షతలకు వ్యతిరేకంగా సిపాయిలు అనేకసార్లు తిరుగుబాట్లు చేశారు.
★ 1764లోనే బెంగాల్ ప్రాంతంలోని సిపాయిలు తిరుగుబాటు చేశారు.
★ 1780లో విశాఖపట్నంలోని సిపాయిలు తిరుగుబాటు చేశారు.
★ 1806లో వెల్లూరు సిపాయిల తిరుగుబాటు జరిగింది. అప్పటి సైన్యాధికారి జాన్ క్రేడర్.
★ 1824లో బారక్‌పూర్ సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటు కారణంగా 47వ దేశీయ పటాలాన్ని రద్దు చేశారు.
★ ఆంగ్లేయులకు సిపాయిల నుంచి ఎదురైన అతిపెద్ద తిరుగుబాటు 1857 సిపాయిల తిరుగుబాటు.
★ రెండో బాహదూర్‌షా జాఫర్ సిపాయిల తిరుగుబాటుకు నాయకుడిగా ఉంటూనే రహస్యంగా ఆంగ్లేయుల వద్దకు రాయబారిగా అమానుల్లా అనే ప్రతినిధిని పంపి రాజీ ప్రయత్నాలు చేశాడు.
★ తిరుగుబాటు కాలంలో దిల్లీలో నికల్సన్, లక్నోలో లారెన్స్, హావ్‌లాక్, నీల్ అనే ఆంగ్ల సైనికాధికారులు మరణించారు.
★ రెండో బహదూర్‌షా జాఫర్‌ను బంధించిన ఆంగ్ల సేనాని కెప్టెన్ హడ్సన్.
★ కాన్పూర్‌లో ఆంగ్ల సైన్యాధికారి వీలర్.
★ నానాసాహెబ్ రాజకీయ సలహాదారైన అజీముల్లా కాన్పూర్ రక్షణ దళాన్ని మోసంతో చంపించాడు.

### ఫలితాలు

★ 1858లో విక్టోరియా మహారాణి ప్రకటన చేసింది. 1858, నవంబరు 1న కానింగ్ అలహాబాద్ దర్బారులో ఈ ప్రకటనను చదివాడు.
★ ఈ ప్రకటన ఆధారంగా 1858 భారత ప్రభుత్వ చట్టాన్ని రూపొందించారు.
★ భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన అంతమైంది. భారతదేశం బ్రిటిష్ రాజు/ రాణి/ పార్లమెంటు ప్రత్యక్ష పాలనలోకి వెళ్లింది.

## డల్హౌసీ విధానాలతోనే 1857 తిరుగుబాటు

◗ లార్డ్ డల్హౌసీ విధానాలు 1857 సిపాయిల తిరుగుబాటుకు ప్రధాన కారణం.
◗ డల్హౌసీ రాజ్య సంక్రమణ విధానాన్ని ప్రవేశపెట్టి (1848) సతారా, జయపుర, సంబల్‌పూర్, భగత్, ఉదయ్‌పూర్, నాగ్‌పుర్, ఝాన్సీ లాంటి రాజ్యాలను ఆక్రమించాడు.
◗ దుష్పరిపాలన నెపంతో 1856లో అయోధ్యను డల్హౌసీ ఆక్రమించాడు.
◗ పీష్వా రెండో బాజీరావు దత్త పుత్రుడైన నానాసాహెబ్ (దోండుపంత్) 8 లక్షల భరణాన్ని రద్దు చేశాడు.
◗ ఆంగ్లేయుల మత మార్పిడి విధానాలు కూడా తిరుగుబాటుకు కారణమయ్యాయి.
◗ "భారతదేశపు ఒక చివరి నుంచి మరో చివరి దాకా క్రైస్తవ పతాకం ఎగరవేయడానికి దేవుడు హిందూస్థాన్ రాజ్య విస్తరణను ఇంగ్లండ్‌కు అప్పగించాడు" అని కంపెనీ డైరక్టర్స్ అధ్యక్షుడైన మాజెల్స్ ప్రకటించాడు.
◗ 1856లో హిందూ వితంతు పునర్వివాహ చట్టాన్ని చేశారు.
◗ 1850లో వారసత్వ చట్టం ద్వారా మతం మార్చుకున్న భారతీయులకు తండ్రి ఆస్తిలో వాటా వస్తుందని పేర్కొనడం భారతీయులు సహించలేకపోయారు.
◗ భారతదేశంలో రైల్వే, తంతి-తపాలా లాంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టడాన్ని సనాతనులైన భారతీయులు వ్యతిరేకించారు.
◗ 1856లో లార్డ్ కానింగ్ "సామాన్య సేవా నియుక్త చట్టం"ను ప్రవేశపెట్టి సిపాయిలు మతపరమైన చిహ్నాలను వాడరాదని ఆదేశించాడు.
◗ "ఇండియా ఖర్చుతో భారతీయ సిపాయిలే భారతదేశాన్ని ఆంగ్లేయుల బానిసత్వంలో అణచి ఉంచుతారు" అని 1853లో కారల్‌మార్క్స్ పేర్కొన్నారు.
◗ సిపాయిల తిరుగుబాటు కాలంలో ఆంగ్ల సైన్యంలో భారతీయ సిపాయిలు 7/8 వంతు ఉండేవారు.
◗ నాటి సైన్యంలో సిపాయిలు 2 లక్షల 32 వేల మంది ఉండగా, ఆంగ్ల సైనికులు కేవలం 45 వేల మంది మాత్రమే ఉన్నారు.
◗ సిపాయిల తిరుగుబాటుకు తక్షణ కారణం ఆవు కొవ్వు, పంది కొవ్వు పూసిన తూటాలు.
◗ 1856లో లార్డ్ కానింగ్ పాత బ్రౌన్‌బేస్ తుపాకుల స్థానంలో ఎన్‌ఫీల్డ్ రైఫిల్స్‌ను ప్రవేశపెట్టాడు.
◗ ఎన్‌ఫీల్డ్ తుపాకులు ఇంగ్లండ్‌లోని వూద్‌వూచ్ ఆయుధాగారంలో తయారయ్యేవి.
◗ 1857 జనవరి 23న డమ్‌డమ్ (కోల్‌కతా)లోని సిపాయిలు కొత్త తుపాకుల విషయంపై ఆందోళన చేశారు.
◗ 1857 ఫిబ్రవరి 26న బెర్హాంపూర్‌లోని 19వ పదాది దళం నూతన తుపాకులను ఉపయోగించడానికి నిరాకరించింది.
◗ 1857 మార్చి 29న బరాక్‌పూర్‌లోని 34వ పటలానికి చెందిన మంగళ్‌పాండే తన పై అధికారి అయిన కెప్టెన్ బాగ్‌ను కాల్చి చంపాడు.
◗ ప్రభుత్వం వెంటనే 19, 34 దళాలను రద్దు చేసింది.
◗ వాస్తవంగా సిపాయిల తిరుగుబాటు 1857, మే 10న మీరట్‌లో ప్రారంభమైంది.
◗ మీరట్‌లోని 3వ అశ్వికదళం తమపై అధికారి కల్నర్ స్మిత్‌పై తిరుగుబాటు చేసింది.
◗ సిపాయిలు దిల్లీకి వెళ్లి రెండో బహదూర్‌షా జాఫర్‌ను తిరుగుబాటుకు నాయకుడిగా చేశారు.
◗ దిల్లీలో తిరుగుబాటులకు నాయకత్వం వహించినవాడు - భక్త్‌ఖాన్.